# శిశిరంలో

ఉదయం తొమ్మిది గంటలు.

సిటీకి కొంచెం దూరంలో ఉన్న ఆ నర్సింగ్‌హోంలోని పోస్ట్ నేటల్ వార్డులోకి అడుగుపెట్టింది సిస్టర్ శాంతా ఏసుపాదం.

ఈ ఉద్యోగం ఇవాళ్టితో ఆఖరు. రేపట్నించి ఈ నర్సింగ్‌హోంలో తను పనిచేయదు. కారణం! తను రిటైర్ అవుతోంది. తనలో యింకా శక్తి ఉంది. పని చెయ్యాలి అన్న తపన ఉంది...కానీ...ఎలా...

యాంత్రికంగా నడుస్తున్న శాంతకి ఆగకుండా వినపడ్తున్న చంటిపిల్ల ఏడుపుకి ఒక్కసారి ఆగి ఈ లోకంలోకి వచ్చింది. అంత ఏడుపేంటి? ఆ గింజుకుంటున్న ఏడుపు. విని జాలి పడింది. ఏం బాధ! కడుపునొప్పా, ఆకలా! ఏం చెప్పగలదు ఆ పాప! అదేవిటి ఆ ఏడుపు ఆగడం లేదు. ఆ పిల్లకేం కావాలో! చెప్పలేని అశక్తత. పాపం!

ఆ వార్డులో ఓ వైపు గదులు మరో వైపు నాలుగు అడుగుల ఎత్తున్న పిట్టగోడ. అవతల పచ్చగడ్డి మొక్కలు. తొంభై డిగ్రీల కోణం దగ్గర మలుపు తిరిగింది. ఇంకా ఏడుపు వినపడ్తోంది.

ఇవాళ ముఖ్యమైన పనులున్నాయి. రావలసిన డబ్బు బెనిఫిట్స్...యింకా, డిహెచ్ఎం.ఎస్ ఆఫీసుకి ఓసారి వెళ్ళాలి. ఆలోచిస్తూనే సిస్టర్స్ రూంలోకి వెళ్ళింది.

లోపల డాక్టరు మమత, డాక్టరు వాధ్వా, ఇద్దరు సోషల్ వర్కర్లున్నారు. డాక్టర్ ఫణీంద్ర కేస్‌షీట్ చూస్తూ మందులున్న బీరువా దగ్గర నిశ్శబ్దంగా నుంచున్నారు.

శాంతని చూడగానే "సిస్టర్! కొంచెం మీరు మాతో రండి" అన్నారు డాక్టర్ మమత. అందరూ కలిసి ఓ గదిలోకి వెళ్ళారు. హోటల్ రూంలాగా అన్ని సదుపాయాలున్న ఆ గదిని గొప్పవాళ్ళే తీసుకుంటారు.

చంటిపిల్ల ఏడుపు ఆ గదిలోంచే. ఉయ్యాలలో ఉన్న పాప ఏడుపువిని చూసి ఒక్క ఉదుటున ఉయ్యాల దగ్గరి కెళ్ళింది.

శాంత పాపని చేతిలోకి తీసుకుంది. మెలికలు తిరుగుతూ ఏడుస్తున్న ఆ బాబుకి ఇంజక్షన్ తయారు చేస్తున్నారు.

పాప కాదు. బాబు అని అనుకుంది.

ఆ బాబు ఏడుపుతో సంబంధం లేనట్లుగా నిద్రపోతోంది మంచం మీద ఆ బాబు తల్లి.

ఓ యాభై ఏళ్ళస్త్రీ కన్నీళ్ళతో అందరికేసి మార్చి మార్చి చూస్తోంది ఆత్రంగా. ఏం చేప్తారా! ఏం వినాల్సొస్తుందా! అని

తన్నుకుంటూ, చేతులు కొట్టుకుంటున్న బాబుని గుండెలకి హత్తుకుంది శాంత.

"దాదాపు నెల పడ్తుంది పూర్తి రక్తంఅంతా క్లీన్ చెయ్యడానికి". ఏం జరిగింది అని అడగాలా వద్దా అని సందిగ్ధంలో పడింది శాంత

సోషల్ వర్కర్స్ యిద్దరూ మాట్లాడుకుంటున్నారు.

"తల్లి కడుపులో ఉండగానే డ్రగ్స్ కలిసిన రక్తంతో పెరిగిన ఈ బాబుకి కూడా అవే కావాల్సి వస్తోంది. రక్తం క్లీన్ చేస్తే నే ఏదయినా యింప్రూవ్‌మెంట్."

అయోమయంగా వాళ్ళకేసి చూసింది.

"ఆ బాబుకి కావల్సింది మనం యివ్వలేము. వాటికోసం ఏడ్చే ఆ బాబు ఏడుపుని చూడలేము."

"అంటే...డాక్టర్...బాబు ఏడుపుకి కారణం..." ఆగిపోయింది శాంత.

"ఓ చిన్నడోసు హెరాయిన్ యిస్తే ఆ ఏడుపు ఆగిపోతుంది" అన్నారు డాక్టర్ మమత.

ఆ మాటలు వినగానే ఆ బాబుని యింకా గట్టిగా అదుముకుంది గుండెకి. అలా గుండెలకి హత్తుకుంటున్న శాంతకేసి చూస్తుండి పోయారు డాక్టర్ మమత సాలోచనగా.

"సిస్టర్! ఇవాళ మీ ఆఖరి వర్కింగ్ డే అని తెలుసు. కాని... ఈ రెండు రోజుల బాబుని మధ్యాహ్నం వరకూ చాలా జాగ్రత్తగా మీరే చూడగలరు. ఉహు...మీరే చూడాలి. ఆ తర్వాత మధ్యాహ్నం షిఫ్ట్‌లో వచ్చే సిస్టర్స్‌లో ఎవరైనా చూస్తారు" అన్నారు ఆవిడ.

మరి కొద్దిసేపటికి, డాక్టర్లు, సోషల్ వర్కర్లు వెళ్ళిపోయారు.

ఆమె గుండెల్లో తలదూర్చి పడుకున్న ఆ గులాబిమొగ్గని ఉయ్యాలలో ఉడుక్కోపెట్టింది శాంత.

ఆ బాబుని ఆ స్థితికి తెచ్చిన ఆ తల్లికేసి చూసింది.

దంతంకి ఆకారం చేసి నల్లటి తుమ్మెదరెక్కల్ని...పైన ఒత్తుగా పెట్టేసినట్లున్న ఆ అమ్మాయిని చూసి ఉలిక్కిపడింది.

ఆ ముక్కు, ఆ గడ్డం, ఆ చెంపలు...ఎక్కడో చూసినట్లుగా అనిపించింది.

సరే తర్వాత ఆలోచించచ్చులే అనుకుంది.

ఇంతందమైన ఈ అమ్మాయి పాడవడానికి కారణం ఎవరు? తల్లి! తండ్రి! ఫ్రెండ్స్! వాతావరణం!

పక్కనే సోఫాలో కూచున్న ఆవిడని చూస్తూ అడిగింది.

"ఏం చదువుకుంది?" అని అడిగింది ఆ స్త్రీని.

"బి.కాం. రెండో సంవత్సరం...చదువుతూండగానే పెళ్ళి చేసాం."

"అంటే...చాలా చిన్నపిల్ల...అప్పుడే పెళ్లి...ఓ బాబు..." తనలో తను అనుకున్నట్లుగా అంది.

"అంత తొందరగా చేద్దామని అనుకోలేదు. మా అమ్మగారు, అత్తగారు పట్టుబట్టి చేసారు. ఈ అమ్మాయి నా మేనకోడలే. ఏనాటికైనా నాయింటికి రావల్సిందే కదా అందరం అనుక్కుని పెళ్ళి చేసేశాం. కాని,... యిలా అవుతుందని, దాని జీవితం యిలా నాశనం అయిపోతుందని కల్లో కూడా అనుకోలేదు. మా రాత..."అంది ఏడుస్తు.

ఒక రెండు నిమిషాలు అక్కడే నుంచుని, "బాబు నిద్రపోతున్నాడు కాబట్టి, యిప్పుడే ఓ ఐదు నిమిషాల్లో వస్తాను" అంటూ గదిలోంచి బయటి కొచ్చింది శాంత.

ఒక్కసారి భవిష్యత్తు గురించిన ఆలోచనలు ముందుకొచ్చాయి. నాలుగురోజుల్నించి డేనియల్ దగ్గరికెళ్ళి ఉద్యోగం గురించి చేసిన ప్రయత్నాలు గుర్తొచ్చాయి. ఎలాగైనా అనాధాశ్రమంలో ఉద్యోగం వచ్చేస్తుందని అయినా ఓ సారి

గుర్తుచెయ్యమన్నాడు డేనియల్. అందులో గనక ఉద్యోగం వచ్చేస్తే తలితండ్రుల ఐదు నిమిషాల తప్పుకి జీవితకాల శిక్షల్ని అనుభవిస్తున్న ఆ పసిపిల్లల మధ్య తన శేష జీవితాన్ని గడపాలని నిశ్చయించుకుంది. ఫోన్ చెయ్యడానికి వెళ్తూ, కారిడార్‌లో మలుపు తిరిగింది.

ఎడమవైపు గోడ, ఆ తర్వాత నర్సింగ్ హోంలోని విశాల ఆవరణ, గేటు, రోడ్డు, రోడ్డుమీద సంచారం. సాలోచనగా చూస్తూ నడుస్తూ వెళ్తోంది. గేట్లోకి ఎర్రమారుతి కారు వచ్చి, ఆవరణలో ఆగింది. ఆ వేపై చూస్తూ నడుస్తోంది.

డ్రైవింగ్ సీట్‌లోంచి, ఓ తెల్లటి మనిషి దిగి, వెనక తలుపు తీసి, నీళ్ళజగ్, ఫ్లాస్క్, ఓ పెద్ద కారీ బ్యాగ్ తీసి చేతుల్లోకి సద్దుకుంటున్నాడు. కారుకి తాళంవేసి నర్సింగ్ హోంకేసి నడుస్తూ ఓసారి పైకి చూసాడు. సరిగ్గా అదే టైముకి శాంతి ఆ మనిషిని చూసింది.

వయసు మీరిన శాంతకి, ఆ మనిషిని క్లియర్‌గా చూడలేక పోయినా ఆ మనిషిని ఎక్కడో చూసినట్లు, ఆ మనిషితో చాలా పరిచయం ఉన్నట్లుగా అనిపించింది. ఆలోచనలో ఉన్న శాంతకి ఆ మనిషి రాజులాగా ఉన్నట్టుగా అనిపించింది. ఉలిక్కి పడింది. రాజు...రాజు...నిజంగా రాజేనా! కాదా! పోనీ...మరోసారి దగ్గరగా వెళ్ళి చూస్తే...

ఎంట్రన్స్ వైపు నడిచింది.

అప్పుడే ఆ వ్యక్తి లోపలికొస్తున్నాడు.

ఏ మాత్రం సంకోచం లేకుండా పరీక్షగా అతని మొహంకేసి చూస్తూ ఎదురు వెళ్ళింది. అవును అతను డాక్టర్ రాజు. ఆ జుట్టు ఆ కళ్ళజోడు, వయసు పైబడ్డా, ఎలా ఉన్నా గుర్తు పట్టగలదు.

రాజు సందేహం లేదు అతనే తను ఒప్పుకుంటే పెళ్ళి చేసుకుంటానన్న రాజు బాగా దగ్గరయ్యాడు.

"గుడ్ మార్నింగ్ డాక్టర్!" మొహం కేసి పరీక్షగా చూస్తూ అంది.

ఆగిపోయాడు.

ఆశ్చర్యంగా ప్రశ్నార్థకంగా ఆమె వైపే చూసాడు.

తను డాక్టరే కానీ, ఈ హైద్రాబాద్, అసలు ఇండియాలోనే డాక్టరుగా పనిచెయ్యడం లేదు. డెబ్బైలోనే అమెరికా వెళ్ళిపోయాడు కదా! ఈమె ఎవరై ఉంటుంది?

"గుర్తు పట్టలేదు కదా!...నేను...."అంటూ చిన్నగా నవ్వింది.

తళుక్కున మెరిసింది పలువరుస. కోన తేలిన గడ్డం కొంచెం ముందు కొచ్చింది.

"అవును...అదే నవ్వు...నూతన్...కాదు శాంత కదూ!" అన్నాడు గుర్తు తెచ్చుకుంటూ మొహంలో సంతోషం బాగా కనపడ్తోంది.

అవునన్నట్లుగా తలూపుతూ పెదవులు విడకుండా నవ్వింది.

"పెద్దదానివయ్యావు" అన్నాడు శాంతని పరీక్షగా చూస్తూ.

"మరే. కష్టపడకుండా వచ్చేది ఈ ఓల్డ్‌ఏజ్ మాత్రమే."

"ఒక్క నిమిషం. ఇవన్నీ మా పాప గదిలో పెట్టివస్తాను. అన్నట్టు మా పాపకిక్కడే డెలివరి అయింది. ఓన్లీ ఫైవ్ మినిట్స్"అంటూ అడుగు ముందుకేసాడు.

"ఉండు. నేను వస్తాను" అనుసరించింది శాంత.

ఇద్దరూ కలిసి, ఇందాకటి గదిలోకి వెళ్ళారు.

చటుక్కున రాజుని, ఆ అమ్మాయిని మార్చి చూసింది. అంతా తండ్రి. అందుకేనా యిందాకా ఆమెను చూసినప్పుడు ఎక్కడో చూసిన, బాగా తెలిసినట్లుగా అనిపించింది.

ఇందాకా మాట్లాడిన స్త్రీ, తలని వెనక సోఫా అంచుకి వాల్చి కళ్ళుమూసుకుని ఉంది. ఫ్లాస్క్, మంచినీళ్ళు అన్నీ టీపాయ్ మీద పెడ్తూంటే వచ్చిన శబ్దానికి కళ్ళు తెరిచి చూసింది.

"శాంతా! ఈవిడ నా చెల్లెలు రాజ్యం. నా కూతురికి అత్తగారు కూడా. రాజ్యం! ఈవిడ..."

చిరునవ్వుతో రెండు చేతులు జోడించింది శాంత.

"నా పరిచయం పెద్దగా అక్కర్లేదు. నేనెవరో ఆవిడకి తెలుసు"

ఆవిడ జీవం లేని నవ్వు నవ్వింది.

"నేను ఉస్మానియాలో చదువుతూన్నప్పుడు మాకు పరిచయం అయింది. ఆ తర్వాత యిదిగో యిప్పుడే కలుసుకున్నాం. దాదాపు ముప్పయి ఏళ్ళు కదూ!" అంటూ శాంత వైపు చూసాడు.

"అలాగా"అన్నట్లు తలూపింది రాజ్యం.

ఫ్లాస్క్‌లోంచి కాఫీని మూడు ప్లాస్టిక్ గ్లాసుల్లో పోసి, వాళ్ళిద్దరికి యిచ్చి, తనొకటి తీసుకున్నాడు.

కాఫీ తాగి గ్లాసుని మూలనున్న చెత్త బుట్టలో వేసి తలుపువైపు నడిచింది శాంత.

"నేను వస్తాను. రాజ్యం యిప్పుడే వస్తాను"అంటూ బయటికి వచ్చి, నడుస్తున్న శాంతని కలుసుకున్నాడు.

పాత విషయాలతో సంభాషణ మొదలు పెట్టడం యిష్టంలేక ఊరుకుంది.

"మీ అమ్మాయి, అంతా నువ్వే. ఎంత పోలికో! పేరేంవిటీ?

"సుధీర. మా అమ్మపేరు అసలు మా అమ్మపేరు సుందరి. ఆ పేరు పాతగా ఉందని, అవే అక్షరాల్ని అటూ యిటూ చేసి పెట్టాము".

నవ్వింది శాంత.

"ఓ డాక్టరు కూతురు డ్రగ్ ఎడిక్ట్ అవడం ఆశ్చర్యంగా ఉంది."

"కానీ, ఆమె ఎడిక్ట్ అయింది అమెరికాలో కాదు. ఇండియాలోనే."

"ఇండియాలోనా! అయితే సుధీర అమెరికాలో చదవలేదా!"

"ఇందాక గదిలో చూసావు చూడు మా సిస్టర్ రాజ్యాన్ని. ఆమె కొడుక్కి సుధీర నివ్వాలని వాళ్ళు పుట్టినప్పుడే అనుక్కున్నాం. ఒకే దగ్గర పెరిగితే ఆకర్షణ ఎక్కువవుతుందని, స్కూలు చదువు అనగానే రాజ్యం దగ్గరికి బొంబాయి పంపాము. మన పద్ధతులు, పండగలూ అన్నీ తెలుస్తాయని మా ఉద్దేశం కూడా పూర్తవుతుంది. మహారాష్ట్రలో ఇంటర్ లేదు. పదకొండో క్లాసులో చేర్పించాము. అప్పుడు మా మేనల్లుడు రాయచూర్ కాలేజిలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. చదువయ్యాకా వాడు అమెరికా రావడానికి ఏమాత్రం యిష్టపడలేదు. బెంగుళూరులో ఉద్యోగం వచ్చింది. పెళ్ళి చేసేసాం. దీని చదువు పూర్తి కాలేదు. పెళ్ళి తర్వాత చదువుతుందిలే అని అనుకున్నాం. అయినా మా సిస్టర్ వాళ్ళు చాలా తొందరపెట్టారు. పెళ్లయ్యి అక్కడికి వెళ్ళాకా మా మేనల్లుడికి కొంచెం అనుమానం వచ్చింది. పెళ్ళికాకముందు సుధీర ఏం చేస్తోందో, ఏం చేసేదో, వీళ్ళు పెద్దగా పట్టించుకోలేదు. చేతినిండా డబ్బుండేది. స్వేచ్ఛ ఉండేది. అయితే పెళ్ళయ్యాకా డబ్బున్నా స్వేచ్ఛ తగ్గింది. కనిపెట్టుకునే భర్త ఆఫీసు పని వేళలు కూడా సుధీరకి యిబ్బందిగా మారడంతో, బెంగుళూరు బాగాలేదని, బొంబాయి వచ్చేసింది. దానితోపాటు మా మేనల్లుడు కూడా బొంబాయి వచ్చాడు. ఏదో వంకతో ఒక్కర్తి బయటికెళ్ళడానికి ప్రయత్నం చేసేది. అబద్ధాలు చెప్పేది. ఏవిటని అడిగితే అరవడం,

ఏడవడం, మొండిగా జవాబులివ్వడం, ఊరుకుంటే లెక్కాపత్రం లేకుండా డబ్బు ఖర్చు చేస్తూంటే మాకు వెంటనే ఓసారి బొంబాయి రమ్మనమని ఫోన్ చేశారు. ఏంటిటి అంత అర్జంటు అని రెట్టిస్తే, సుధీర ప్రవర్తన గురించి చెప్పారు. వెంటనే మేం ఇద్దరం వచ్చేసాం. అందరం కూచుని మెల్లగా అన్ని విషయాలు తెలుసుకున్నాం. ఫ్రెండ్స్ అలవాటు చేయించారని, వాళ్ళే సప్లయి చేస్తుంటారని డ్రగ్స్ అలవాటయిందని చెప్పి ఏడ్చేసింది."

ఆశ్చర్యంగా వింటోంది శాంత.

"మానేయగలవా!"అని అడిగాము అంతా దాన్ని

"మానాలనే చాలా సార్లు ప్రయత్నించిందిట కానీ సాధ్యపడలేదుట. చాలా ఏడ్చింది ఎలా అయినా తన అలవాటుని మానిపించెయ్యమని గొడవవ.

"అందరం కలిసి డాక్టర్ దగ్గరి కెళ్ళాం. దాని మొండితనం, అబద్ధాలు ఈ గొడవల మూలంగా సుధీరకి పీరియడ్ మిస్ అయిందేమో అన్న ఆలోచన ఎవరికీ రాలేదు. తీరా డాక్టరు దగ్గరి కెళ్ళాక మాకు తెలిసింది తను ఐదు నెల్ల కడుపు అని. యింక మా బాధ చెప్పడానికి లేదు. సరిగ్గా అప్పుడే మా అల్లుడు ఏదో ప్రాజెక్ట్ కోసం లండన్ వెళ్ళాడు. అబార్షన్ చేయించలేము, ఆమె బాధని చూడలేము. ఈ నాలుగు నెలలు ఎటువంటి యాతన అనుభవించామో ఆ భగవంతుడికే తెలుసు. ఏంవయితేనేం, డెలివరి అయింది. బాబు పుట్టాడు, కానీ వాడిది అదో బాధ"అన్నాడు కళ్ళు మూసుకుంటూ.

"ఇంక యిప్పుడు ట్రీట్‌మెంట్ యింకా యాతన. అయినా ట్రీట్‌మెంట్ ఎక్కడ యిప్పిద్దామని."

"బొంబాయిలోనే. డ్రగ్ రీహబిలిటేషన్ సెంటర్‌లు అక్కడున్నాయి. ఈ హైద్రాబాద్ వచ్చేముందు అక్కడ డాక్టర్లతో అంతా మాట్లాడి వచ్చాము. నువ్వేమంటావ్? నీ అభిప్రాయం ఏంటిటీ?"

"నన్నడిగావ్ కాబట్టి చెప్తున్నాను. బొంబాయి వద్దు. మళ్ళా అదే వాతావరణం, తిరిగి ఫ్రెండ్స్‌తో కాంటాక్ట్స్ రివైవ్ అయితే! వద్దు. ఢిల్లి వాతావరణం మంచిది. మీకు ఎవరూ తెలీదు. తెలిసిన వాళ్ళు కూడా ఎవరూ ఉండరు. ఢిల్లీలో 'అభయ'అని ఉంది. అక్కడి డ్రగ్ ప్రోగ్రాంస్‌లో సైకో థెరపీ, డ్రగ్ కౌన్సిలింగ్ ఉంది. నేను వెళ్ళి చూసి వచ్చాను. అక్కడయితే బావుంటుంది."

"ఢిల్లీలో ఎక్కడ!"

"జనపథ్‌లో. యిప్పుడు నా క్కొంచెం ఆఫీసులో పనిఉంది. తర్వాత మరో సిస్టర్ వస్తారు. ఆమె వచ్చాకా నేను డిహెచ్ఎంఎస్ ఆఫీసుకెళ్ళాలి."

"సుధీర దగ్గరే కూచుందాం"అంటూ ముందుకు నడిచాడు.

నిట్టూర్చింది. ఫోన్ చెయ్యడానికి కుదరలేదు. పోనీ, సాయంత్రం చేస్తే...

యిద్దరూ కలిసి గదిలోకి వచ్చారు.

బాబు లేచి ఏడుస్తున్నాడు. రాజ్యం ఎత్తుకున్నా ఊరుకోడం లేదు.

శాంత బాబుని చేతుల్లోకి తీసుకుంది.

బట్టలు మార్చడానికి ఉయ్యాలలో పడుకో పెట్టింది.

ఉస్మానియాలో చదివేటప్పుడు, ట్రెయినింగ్ అవుతున్న ఈ సిస్టర్‌శాంతని ప్రేమించాడు. కానీ, పెళ్ళి చేసుకోలేక పోయాడు. ఆమె వెనకాల పెద్దసంసారం. వాళ్ళకోసం పెళ్ళి చేసుకో దల్చుకోలేదు. తిరిగి యిన్నేళ్ళ తర్వాత ముసలి తనంలోకి అడుగుపెడ్తున్న సమయంలో...యిలా కలుసుకోడం...ఆశ్చర్యంగా అనిపిస్తోంది రాజుకి.

గుమ్మం దగ్గర అలికిడికి అందరూ అటువైపు చూసారు.

డాక్టర్ మమత, చిల్డ్రన్ స్పెషలిస్ట్ డా.వాధ్వా, సైకాలజిస్ట్ సైకియాట్రిస్ట్, సోషల్ వర్కర్స్ వచ్చారు. అందరూ తెలిసినవారే శాంతకి.

వాళ్ళని చూసి శాంత పక్కకి తప్పుకుంది.

"ఒళ్ళు ఎలా గీరుకుంటున్నాడో, చూడండి డాక్టర్, గోళ్ళు కత్తిరించాలు"అంతా ఆ బాబుని పరీక్షిస్తున్నారు.

"చూడండి, బాబుకి యివ్వాల్సిన మందులన్నీ రాసిస్తాను. వాటితోపాటూ మెగాడోసెస్‌లో ప్రేమ, ఆప్యాయత కూడా యివ్వాలి."

రాజు అయోమయంగా చూసాడు. ఓ డాక్టర్‌గా, ఉండాల్సిన మనో ధైర్యం ఎప్పుడో కోల్పోయాడు. ఓ తండ్రిగా, ఓ తాతగా ఆందోళన పడుతున్నాడు.

డాక్టరు రాసిన మందులతోపాటూ ప్రేమ, ఆప్యాయత కూడా బజారులో దొరికితేనే కొనాలి కానీ యింట్లో దొరకదు.

బాలింతరాలు సుధీరనే చూడాలా! రెస్ట్‌లెస్‌గా ఏడ్చే బాబునే చూడాలా! యిద్దరూ కూడా కావాలి.

శాంత బాబుకి గోళ్ళు కత్తిరించింది. పాలు పట్టింది. బుజాన వేసుకుని వీపు రాస్తూండి పోయింది.

అన్నా చెల్లెళ్ళు జరిగిన దాని గురించే మాట్లాడుకుంటున్నారు.

శాంత కలగ చేసుకుంది.

"ఏమనుకోకపోతే, నేను కొంచెం మాట్లాడుతాను. అయిపోయిన దాని గురించే ఎందుకు మాట్లాడుకోడం? సుధీర, బాబు, వాళ్ళిద్దరి భవిష్యత్తు మీ అందరి చేతుల్లో ఉంది. అందుకోసం మీరంతా ఏం చేస్తే బావుంటుందో ఆలోచించుకోవాలి. అది ముఖ్యం. కానీ, ఒక్కటి గుర్తు పెట్టుకోండి. సుధీర డ్రగ్ ప్రోగ్రాం అయ్యాకా, ఆమెను ఓ క్రిమినల్‌గా చూడకూడదు. అది చాలా ముఖ్యం. దానికోసం ఆమెను తీసుకుని ఎక్కడికయినా మీరంతా వెళ్ళండి."

ఇద్దరూ ఏం మాట్లాడలేదు. ఆలోచనలో ఉండిపోయారు.

బాబుని ఉయ్యాల్లో పడుక్కో బెట్టి ఊపడం మొదలు పెట్టింది. ఆలోచన డేనియల్ వైపు మళ్ళింది. ఒక్కసారి ఫోన్ చేస్తే...ఉద్యోగం గురించి చెప్తాడు. లేదా ఆదిలాబాదులోని ట్రైబల్ హాస్టల్లో వార్డెన్‌గా ఖాళీ ఉందని తెలిసింది. దాని గురించి ప్రయత్నం చేస్తాడు. అయోమయంగా భవిష్యత్తు వైపు దృష్టి మళ్ళించుకుంది.

"శాంతా! నీ డ్యూటి ఎంతవరకూ?"

"ఇవాళ ఆఖరి వర్కింగ్ డే. ఏం డ్యూటి లేదు. కాని కొంచెం ఆఫీసు పన్లున్నాయి. యింకో సిస్టర్ వచ్చాకా నేను వెళ్ళిపోవాలి."

"అయితే నిన్ను కలవడం కుదరదా!" గబుక్కున అనేసాడు రాజు.

నవ్వింది.

"నేను ఈ ఆసుపత్రి ఆవరణలో ఉంటున్నాను. యింకా క్వార్టర్ ఖాళీ చెయ్యలేదు. రెండుద్యోగాలున్నాయి. అందులో ఏదో ఒకటి వస్తుందని నాకు గట్టి విశ్వాసం ఉంది. ఎందుకైనా మంచిదని నాకున్న కొంచెం సామాను పాక్ చేసుకున్నాను. నేను సాయంత్రం వస్తాను. మీకు ఆ ఢిల్లీ అడ్రస్ తీసుకొస్తాను. అప్పుడు కలుసుకోవచ్చు."

రాజుకి అర్థం అయిది శాంతకి పెళ్ళికాలేదుని. ఎలా తెసుసుకోవాలి ఆమె గురించి? ప్యూర్ పర్సనల్ విషయాలు శాంత చెప్పదు.

"యిల్లు ఖాళీ ఎప్పుడు చేస్తున్నావ్?"

"మూడొంతులు రేపు" ఆలోచిస్తూ అంది. డేనియల్ గుర్తొచ్చాడు.

"ఎక్కడికి? అంటే ఎక్కడికి వెళ్తావూ అని"

"నేను ఎక్కణ్ణించి వచ్చానో అక్కడికే. అనాథాశ్రమానికి."

తెల్సింది పెళ్ళి చేసుకోలేదని. తెలియంది ఏసుపాదం పిల్లలు ఈమెని ఆదరించలేదా! ఆదరించరా! అనిశాంత. అనాథాశ్రమంలో పెరిగిన పిల్ల. ఆ అనాథాశ్రమంలోనే పనిచేసే ఏసుపాదంకి పిల్లల్లేకపోతే శాంతని పెంచాడు. ఆ తర్వాత ముగ్గురు కొడుకులు పుట్టారని, మంచి చదువులు చదువుకుంటున్నారని శాంతే చెప్పింది. ఇప్పుడు మంచి ఉద్యోగాల్లోనే ఉండి ఉండాలి.

"ఎందుకు అక్కడికి? మేం లేమా!"అన్నాడు రాజు.

"అవునండి. మీరు పెద్దవారయ్యారు. పైగా ఒంటరివారు. మీరూ మాతోనే ఉండండి" అప్యాయంగా అడిగింది రాజ్యం.

"ఒంటరిదాన్ని కాదండి. ఒంటరిదాన్ని అని నేనెప్పుడూ అనుక్కోలేదు. ఒక్కసారి అనాథాశ్రమానికి వెళ్తే, ఆ గేట్లులోంచి చూస్తుంటే తెలుస్తుంది, వాళ్ళంతా నావాళ్ళే అని. అంతమందికి నా అవసరం ఉన్నప్పుడు ఒంటరిదాన్ని ఎలా అవుతాను? నా మీద అభిమానం కొద్దీ ఆహ్వానించారు. దానికి కృతజ్ఞురాలిని."

"ఒక్కటడుగుతాను. నీకు ముగ్గురు తమ్ముళ్ళున్నారు. వాళ్ళందర్నీ ఏసుపాదం పోతే చదివిస్తున్నానని అన్నావు. ఆ సంగతి నాకు బాగా గుర్తు. వాళ్ళ చదువుల కోసం నీ పెళ్ళి కూడా మానుకున్నావు. వాళ్ళంతా లేరా! ఒంటరి దాన్ని అని ఎందుకనుకుంటావు? వాళ్ళకిప్పుడు నీ అవసరం ఉండక పోవచ్చు..."

"వాళ్ళనేమి అనకు. ఈ సంఘంలో శాంత ఫలానా ఏసుపాదం కూతురు అన్న ఓ స్టాటస్ నిచ్చిన నా పెంపుడు తండ్రి ఋణాన్ని తీర్చుకోడం కోసం నా డబ్బు ఖర్చు పెట్టాను. అంతేకానీ, వాళ్ళనుంచి నేనేమి ఆశించలేదు. వాళ్ళు నా కన్యాయం చేసారని నేనెప్పుడూ అనుక్కో లేదు. నాకు నిజంగా అన్యాయం చేసినవాళ్ళు నన్ను కనేసి పారేసిన నా తల్లి, రెండు నిమిషాల సుఖానికి బదులుగా నా జన్మకి కారణం అయిన తండ్రి."

ఆమె వైపే చూస్తున్న వాళ్ళిద్దర్నీ, అలానే, ఆ గదిలో వదిలేసి బయటికి వచ్చింది. మరో సిస్టర్ కృపని వెంటనే సుధీర ఉన్న రూమ్‌కి పంపి, డిహెచ్ఎంఎస్ ఆఫీసుకెళ్ళింది.

ఐదున్నర దాటాకా తన గదిలోని మంచం మీద వాలిపోయింది. రాజు! రాజు

కనపడ్డాడని ఎప్పుడయినా అనుకుందా! తన వాళ్ళకోసం ఈ రాజుని వదులుకుంది. ఎందుకో గుండెల్లో ఓ మూల సన్నటి నొప్పి మెల్లిమెల్లిగా తడమడం మొదలెట్టింది.

"మీరు చాలా అందంగా ఉంటారు." కేస్ సర్జెన్సీ చేస్తున్నడాక్టరు, నర్సింగ్ ట్రెయినింగ్ చేస్తున్న శాంతని చూసి అన్నాడు.

ఈ నర్సింగ్ కోర్సులో జాయినయినప్పట్నించి యిలాటివి చాలాసార్లు వినింది.

మరోసారి ఓ.పి.లో ఉన్నప్పుడు, పేషెంట్లు ఎవరూ లేనప్పుడు అన్నాడు. "మీరు చాలా అందంగా నవ్వుతారు. మీరు నవ్వుతూంటే హిందీ హీరోయిన్ నూతన్ గుర్తొస్తుంది."

చురుగ్గా చూసి తనపని చేసుకోడం మొదలెట్టింది.

రాన్రాను తెలీకుండానే రాజువైపు ఆకర్షితురాలైంది. చనువు పెరిగింది. యింటి విషయాలు, స్వవిషయాలు, ఫీలింగ్స్ చెప్పేంత దగ్గరితనం ఏర్పడింది.

ఎంతో సిస్టమాటిక్‌గా, డిసిప్లీన్డ్‌గా ఉండే శాంత రాజుకి ఆరాధ్యం అయింది. సిలోన్‌లో ఈసిఎఫ్ఎంజి పరీక్షరాయడానికి వెళ్తూ, ఓ అడుగు ముందుకేశాడు.

"శాంతా! మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలని ఉంది. అభ్యంతరమా!"

నవ్వింది.

"అభ్యంతరమే. జరగని వాటి గురించి మాట్లాడకూడదు."

"ఇందులో జరగనిది ఏముంది? నిజంగానే. మా వాళ్ళని నేను ఎదిరించగలను. ఆ ధైర్యం నాకుంది. సిలోన్ (శ్రీలంక) వెళ్ళి రాగానే నాకు ఏ సంగతి చెప్పాలి."

"అంతదాకా ఎందుకు? నా అభిప్రాయం యిప్పుడే చెప్తాను. నాకు పెళ్ళి అన్నా, మీరన్నా యిష్టం ఉన్నా, నాకు కొన్ని బాధ్యతలున్నాయి. తల్లి, తమ్ముళ్ళు వాళ్ళ చదువులు ఇవన్నింటిని వదిలేసి నా స్వార్థం నేను చూసుకోలేను."

"అలా అనకు. నీ వాళ్ళు నా వాళ్ళే, నీ బాధ్యతలు నావికావా! వాళ్ళందర్నీ నేను పోషిస్తాను" ఆవేశంగా అన్న రాజుని చూసి నవ్వింది.

"ఆఁ...అదే వద్దు. ప్రేమించడం అంటే పొందాలి, స్వంతం చేసుకోవాలన్న నియమం పెట్టుకోకు. నీ సాహచర్యంలో నేనేం పొందానో, ఏం పోగొట్టుకుంటున్నానో నాకు బాగా తెలుసు"అంది నీటిపొరలు కమ్మిన కళ్ళని నేలవైపు మళ్ళిస్తూ.

ఆ తర్వాత రాజు ఎక్కాం పాసయ్యాడు. భీమవరం దగ్గర్లో ఉన్న ఆకివీడులో పెళ్ళయింది. అమెరికా వెళ్ళాడు. అంతవరకే తెలుసు.

ఇన్నేళ్ళ తర్వాత, యివాళ్ళ, యిలాటి దీన స్థితిలో కనపడ్తాడని అనుకోలేదు.

తలుపు తట్టిన శబ్దం.

కిటికీలోంచి చూసింది. రాజు

తలుపు తీస్తూ "రండి" అంది. కొంచెం యిబ్బందిగా ఉంది. గది అంతా సామాన్లతో చిందర వందరగా ఉంది.

"కాఫీ తెప్పించనా కాంటీన్ నుంచి. సామానంతా పాక్ చేసాను."

"వొద్దు, నేను నిన్ను ఒకటి కోరడానికి వచ్చాను. నాకు సహాయం చెయ్యాలి."

"నేనా!" ఆశ్చర్యంగా ఉంది.

"అ చెప్పాలన్నా, అడగాలన్నా ఎలాగో ఉంది. కానీ, అడగక తప్పదు. మా సుధీర ఆరోగ్యం బాగు పడేవరకూ బాబుని పెంచగలవా! ఈ బాబు మా అందరికీ కావాలి. అసలు మా యిళ్ళల్లో పిల్లలు ఎక్కువగా ఎవరికీ లేరు. నువ్వు మాతోనే ఉంటే నీ స్వతంత్రం పోతుందేమోనని నా కనిపించింది. అయినా దానికి నువ్వు యిష్టపడలేదు, నిన్నడిగినప్పుడు అందుకే ఈ నాలుగు రోజుల పిల్లాణ్ణి నీ కప్పగిస్తాను. ఓర్పుగా, నేర్పుగా, ఎంతో ప్రేమగా నువ్వు పెంచగలవు."

శాంత ఏం మాట్లాడ లేదు.

"అందరున్నా కూడా నిన్ను అడుగుతున్నానని అనుకుంటున్నావా! అలా అనుకోకు. అందరూ ఉన్నా కూడా, ఈ బాబుని పెంచాల్సిన విధంగా పెంచలేరు. ఇంకెవరైనా ఐతే ఉన్నవి లేనివి కల్పించి సుధీర మీద దుష్ప్రచారాలు చేస్తారేమో. నా భార్య ఓ కాలు తీసి మరో కాలు వేయడానికి చాలా టైము తీసుకుంటుంది. అమెరికా జీవితానికి అలవాటు పడింది. పైగా ఈ గుమ్మం పట్టనంత లావు. చంటి పిల్లాణ్ణి, పైగా ఈ రోజుల పిల్లాణ్ణి, అందులో డ్రగ్స్ కోసం గింజుకు పోతూ ఏడ్చే పిల్లాణ్ణి అస్సలు చూడనేరదు. నా చెల్లెలుకి బొంబాయిలో కాలుపెట్టి నప్పట్నించి, ఆ డస్ట్, ఆ వాతావరణం పడక ఆస్తమా వచ్చింది. యింక ఎవరూ లేరు. అందుకే...శాంతా...ప్లీజ్..."

రెండు నిమిషాలు ఆలోచనలో పడింది.

భవిష్యత్తు యిందాకాలాగా మసక మసకగా లేదు. క్రిస్టల్ క్లియర్. రేపట్నించి ఏం చెయ్యాలో దేవుడే నిర్ణయించాడు.

"నాకేం అభ్యంతరం లేదు. డాక్టర్లకి కూడా చెప్పాలి. వాళ్ళ సలహా కూడా

తీసుకుందాం. ఇదే గదిలో ఉండడానికి అనుమతిస్తే, ఎందుకుకంటే అలవాటయిన డాక్టర్లు, సిస్టర్స్, వాతావరణం"

"అంతే కదా, మమత నా ఫ్రెండేకదా! అందుకే కదా, యిక్కడికి సుధీరని తీసుకొచ్చాము. మా యిద్దరి మధ్య అండర్‌స్టాండింగ్ అంటూ ఉందిలే. నువ్వు యిక్కడే ఉండచ్చు. దానికి కావల్సిన ఏర్పాట్లు నేను చూస్తాను. సంతకం చేసిన చెక్‌బుక్ నీకిచ్చి వెళ్తాను. నీకు ఏవిధమైన యిబ్బంది రాకుండా మేము చూసుకుంటాము. సుధీరకి మామూలు పరిస్థితి వచ్చేదాకా! చేస్తావుకదా! ఏమంటావు శాంతా! బాబుని చూస్తావుకదా!"

"అంతగా అడగాలా! రేపట్నించి నేనేం చెయ్యాలో, ఈ సాయంత్రం నాకు తెలిపోతే నాకు ఆనందమే కదా డాక్టర్! మీరు నిశ్చింతగా ఉండండి. బాబుని నామీద వదిలేసి సుధీరని తీసుకుని ఢిల్లీ వెళ్ళండి."

అప్పుడే తెల్లారింది.

ఊరికి కాస్త దూరంలో ఉన్న నర్సింగ్‌హోం కాబట్టి దట్టంగా పెద్దపెద్ద చెట్లున్నాయి. వాటిమీద నిర్భయంగా జీవిస్తున్న పక్షులున్నాయి. వాటి రకరకాల అరుపులతో కూతలతో శాంతకి మెలకువ వచ్చింది. అసలు రాత్రి అంతా నిద్ర పోనేలేదు. ఇలాటి రోజుందని తెలుసు. వస్తుందని తెలుసు. కానీ, నిజంగా ఆ రోజు వచ్చేసరికి బాధగా ఉంది. ఆ ఆలోచనతోనే రాత్రి నిద్ర పట్టలేదు. ఎప్పుడో తెల్లారుఝామున కునుకు పట్టింది శాంతకి.

ఎదురుగా పసిపిల్లాడి కాలెండర్. దానికింద ఆగష్టునెల ఉన్న పేజి. దానిలో పధ్నాలుగు నంబరుని బోల్డుగా ఆకుపచ్చటి స్కెచ్‌పెన్‌తో గుండ్రంగా చుట్టిఉంది.

ఇవ్వాళే ఆగష్టు పధ్నాలుగు.

ఇవాళే రాజు వచ్చి బాబుని తీసుకెళ్ళిపోతాడు.

ఒక్కసారి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బేబికాట్‌లో బాబు నిద్రపోతున్నాడు. ఈ రోజు వస్తుందని తెలుసు. బాబు తన దగ్గర ఉండడు అన్న సంగతి తెలుసు. అయినా ఎందుకు బాధపడ్తోంది?

ఈ బాధ బాబు వెళ్ళిపోతున్నందుకా?

రేపట్నించి వృద్ధాశ్రమంలో ఉండాల్సి వస్తుందనా!

ఒక్కసారి నీరసం ఆవహించింది. మళ్ళా డేనియల్‌ని కలుసుకుని అనాధాశ్రమంలోని ఉద్యోగం యిప్పించమని బతిమాలాలి. రెండు రోజుల క్రితం డేనియల్‌కి ఫోన్ చేసి చెప్పింది. ఆగష్టు పదిహేను వరకూ బాబుని ఉంచుకుని చూస్తుందని ఆ తర్వాత ఫ్రీ కాబట్టి ఉద్యోగం యిప్పించమని. "చేసినన్నాళ్ళు ఉద్యోగం చేసావు. యింక రెస్ట్ తీసుకో"అని సలహా యిచ్చాడు.

అంతేనా! అరవయి కూడా నిండలేదే! అప్పుడే విశ్రాంతా! యిద్దరు ముగ్గుర్ని కనుక్కుంది అందరూ అదే అన్నారు. డబ్బుని ఫిక్సిడ్‌లో వేసుకో. ఆ వడ్డీతో ఏదో ఓ ఆశ్రమంలో బ్రతుకు అని. ఆ సలహాలే వయసుని మరో పదేళ్ళు పెంచినట్లుగా ఫీలయింది.

'పదిహేను రోజుల క్రితం రాజు ఫోన్‌చేసి చెప్పాడు. "సుధీర డ్రగ్ ప్రోగ్రాం అయిపోయింది. మనిషి మాములుగా అయింది. యిది వరకూ అనుక్కున్నట్లుగానే బాబుని తీసుకెళ్ళడానికి ఆగష్టు పధ్నాలుగున పొద్దున ఫ్లైట్‌లో వస్తాము. నీ దగ్గరికి వచ్చేప్పటికి పది, పదిన్నరా అవచ్చు."

ఈ పదిహేను రోజుల్నించి ప్రతి పదినిమిషాలకి ఫోన్. అసలు బాబు యిక్కడికి వచ్చినప్పట్నించి, రోజు ఫోన్లే. లండన్‌నుంచో, ఢిల్లీ నుంచో, అమెరికా నుంచో ఎక్కడో అక్కడి నుంచి.

బాబు తన దగ్గర కొచ్చేప్పుడు ఓ వారం రోజుల పిల్లాడు. ఏది కావాలో, ఏం కావాలో చెప్పలేక, కావలసింది పొందలేక బాధతో గింజుకుని ఏడ్చే పిల్లాడు. అలాటి బాబుని యిన్ని రోజులు పెంచింది. అయితే తనకు తెలీకుండానే మమకారం పెంచుకుందని నిన్నటి వరకూ తెలీలేదు. బాబుని యివ్వాలని లేదు. కానీ, యివ్వక తప్పదు. తన పని సేవ చేయడం వరకే. బంధం...అనుబంధం...యివన్ని పదాలు తన నిఘంటువులో ఉండకూడదు.

బెంగతోనే తయారయింది శాంత.

బాబుని తయారు చేసింది.

బాబు బట్టలు, బొమ్మలు అన్నీ కూడా సూట్‌కేసుల్లో సద్దింది. మందులు అన్నీ ఓ చిన్న కిట్‌లో ఉంచింది. పాల సీసాలు డబ్బా అన్నీ మరో బుట్టలో సద్దింది.

డ్యూటికి వస్తూ, డ్యూటి అయిపోయి వెళ్తున్న సిస్టర్స్, ఆయాలు అందరూ వచ్చి బాబుని పలకరించి వెళ్ళిపోయారు.

సమయం ఎలా జారిపోతోందో గమనించలేదు.

కారుకోసం ఎదురు చూస్తూ తన క్వార్టర్ ముందున్న వరండాలో రాకింగ్ చెయిర్ వేసుకుని, బాబుని ఒళ్లో ఉంచుకుని ఆడిస్తోంది.

ఒక్కసారి కలకల ధ్వని. మాటలు.

కారు ఆగింది. ముందునుంచి, వెనకనించి గబగబా రాజు, సుధీర, రాజ్యం, బహుశా రాజ్యం కొడుకు కావచ్చు దిగారు.

పరుగు పరుగున గేటు తీసుకుని అందరూ ఒక్కసారిగా లోపలికొచ్చారు. దిగ్గున లేచింది శాంత. సంతోషంతో, మెరుస్తున్న కళ్ళతో సుధీర గబుక్కున బాబుని తీసుకుంది.

సుధీరని చూసి తృప్తి చెందింది శాంత.

"రా! ఇలాదా! మా బాబు కదూ!"అంటూ ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు బాబుని పిలుస్తూంటే గబగబా అటుయిటూ వచ్చిరాని నడకతో పరుగులు తీస్తున్నాడు.

అందరూ ఏదేదో అడుగుతున్నారు. ఏదో అంటున్నారు. కానీ, ఏం వినపడడం లేదు.

శూన్యం అయిపోయిన మనసుతో తన ఆనందాన్ని ఎత్తుకుపోతున్న వాళ్ళ మొహాలకేసి బెంగగా చూస్తోంది.

ఈ లోపల డ్రైవర్ ఏవేవో అట్టపెట్టెలు, బుట్టలు అన్నీ తెచ్చి లోపల పెడ్తున్నాడు.

మధ్యమధ్యలో వచ్చి వెళ్తున్నారు కాబట్టి బాబుకి వాళ్ళు క్రొత్తగా అనిపించలేదు. ముద్దుగా చెయ్యి ఊపుతూ వాళ్ళతో వెళ్ళిపోయాడు. కారులో వెళ్తుంటే సరదాగా వాళ్ళతో కలిసి పోయినట్లు వాడి మొహమే చెప్తోంది. ఇప్పుడు తెలీకపోవచ్చు తనమీద బెంగ పెట్టుకోవచ్చు. అయినా తనని మరిపించేంత మురిపెంగా పెంచగలరు. పిల్లలు మరిచిపోడం ఎంతసేపు!

తిరిగి ఒంటరి జీవితం. ఆ హోంకి వెళ్ళక తప్పదు. కొత్త మనుషులు కొత్త వాతావరణం, అన్నింట్లో సర్దుకు పోవాలి. జీవితం అంతా అక్కడే గడపాలి. ఉట్టిగా, గోళ్ళు గిల్లుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ, అన్నం తింటూ...యింతేనా జీవితం...ముసలి తనం శాపమవుతోందా!

ఒక్కదాన్ని ఉండేకన్నా పదిమంది కనపడే ఆహోం నయం. కోల్పోయిన ధైర్యాన్ని తెచ్చుకుని, చెల్లాచెదరుగా ఉన్నవన్నీ మెల్లగా తీయడం మొదలు పెట్టింది.

ఈ లోపల ఆయా వచ్చింది.

"బాబుని తీస్కబోయిన్రా! యిల్లంతా కాలికాలిగా ఉంది బోసిగుంది."

శాంత పేలవంగా నవ్వింది.

"పెద్ద డాక్టరమ్మ పిలుస్తుంది. దా!"అంటూ అక్కడే నుంచుని రాజు, సుధీరా వాళ్ళు తెచ్చిన పెట్టెల్ని చూస్తోంది.

దాదాపు ఏడాదిగా డాక్టర్ల సలహా తీసుకుని, అదే ఆసుపత్రి ఆవరణలో, ఓ పెద్ద యింట్లో బాబుని పెంచింది శాంత.

"అలాగేలే. అవన్నీ ఏవో స్వీట్లలాగా ఉన్నాయి. మీరంతా తీసుకోండి. నే డాక్టర్ దగ్గరి కెళ్ళొస్తాను"అంటూ తలుపు దగ్గరి కెళ్ళింది.

"నేను బోత. తాలమెయ్యి శాంతమ్మా!"అంటూ వెళ్ళిపోయింది. రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ల ఫ్లాట్లు, డ్యూటి నర్సెస్ క్వార్టర్స్‌దాటి పార్కుదాటి హాస్పటల్‌లోకి అడుగు పెట్టింది. నిశ్శబ్దంగా ఉన్న కారిడాల్లో బూట్ల చప్పుళ్ళు తప్ప మరేం వినపడడంలేదు. అదే ఒ.పి.అయితే గోలగోలగా ఉంటుంది.

ఒక్కొక్క గది దాటుకుంటూ లిఫ్ట్ దగ్గర కొచ్చింది.

"బాబుని తీసుకెళ్ళారా!"అంటూ తెలిసిన వాళ్ళు పలకరిస్తున్నారు. "డాక్టర్ యిక్కడే ఉన్నారు"అంటూ సిస్టర్ కృప పలకరించింది.

డాక్టర్ గదిలోకి వెళ్ళింది.

"రండి, సిస్టర్. కూచోండి. మీతో కొంచెం మాట్లాడాలి."

కూచుంది.

"మీరు డాక్టర్ రాజు గ్రాండ్‌సన్‌ని పెంచినతీరు అది మాకు చాలా ఆనందాన్నిచ్చింది. మధ్యమధ్య వచ్చి చూసి వెళ్ళిన సోషల్ వర్కర్స్ కూడా చాలా సంతృప్తి వ్యక్తం చేసారు. సోషల్ వెల్ఫేర్ వాళ్ళు మన హాస్పటల్లో కౌన్సిలింగ్, సైకో థెరప్యూటిక్ ప్రోగ్రాం పెడ్తామని అన్నారు. దీనికి మీ సహాయం మాకు కావాలి. మీకు రెస్ట్ కావాలి అని అనుకుంటే మేము మిమ్మల్ని బలవంతం చెయ్యలేము. కానీ, మీలాటి సిస్టర్ని

వదలుకోడం మాకిష్టంలేదు. డ్రగ్స్‌కి బానిసలయిన వాళ్ళకి కావల్సిన ప్రేమ, ఓర్పు మీ దగ్గరున్నాయి. అందులో ఓ గ్రూప్‌వాళ్ళకి మీలాటి వయస్సున్న సిస్టర్స్‌కావాలి. మీరు కాదనరన్న నమ్మకం మాకుంది. అప్పుడే కెనడానుంచి యిద్దర్ని అంటే డ్రగ్ ఎడిక్ట్స్‌ని మీకు అప్పచెప్పాలని అనుకుంటున్నాము. వాళ్ళిద్దరూ మన తెలుగువాళ్ళే. మీ గురించి డాక్టర్ రాజు చెప్పారని యిక్కడికి వచ్చామని అన్నారు. ఒక్కటి గుర్తు పెట్టుకోండి. మందులకన్నా ఓర్పు, ప్రేమా ఈ థెరపికి కావాలి. అది ప్రస్తుతం మీ దగ్గర చాలా ఉంది. ప్లీజ్! ప్రస్తుతానికి ఓప్పుకోండి."

సంతోషంగా చూసింది.

ముసలితనం వచ్చిందని, యింక ఏ పనికి పనికిరాదని, చెయ్యలేనని బాధపడింది.

కానీ,...యివ్వాళ వచ్చిన ఈ ఆఫర్‌కి ముసలితనమే ఎసెట్. ఈ వయసులో కూడా తన అవసరం కావలసిన వాళ్ళున్నారు.

మెరుస్తున్న కళ్ళతో 'అలాగే'అంది.

'ఓ తలుపు మూసుకుంటూంటే మరో ద్వారం తెరచి ఉంటుంది' మనసులో అనుకుంది.

✧ జూలై, ఆగస్టు 2005 'అమ్మ' మాసపత్రికలో ✧